

# వెండితెర సాక్షిగా

## - జీడిగుంట రామచంద్రమూర్తి



**మనుషులు రెండు రకాలు.**

"డబ్బు సంపాదించుటెట్లు?" అని రాత్రింబగళ్ళు జుట్టు పీక్కుంటూ ఆలోచించే టైపు మనుషులు మొదటిరకం.

"సంపాదించిన డబ్బు ఖర్చు చేయుటెట్లు?" - అని అల్లాడిపోయే అదృష్టవంతులు రెండోరకం.

మొదటి రకం మనుషులు ఈ దేశం నిండా ఉండచ్చు.. కానీ రెండో టైపు వాళ్ళు మాత్రం హైదరాబాదు, మదరాసు, బొంబాయి వంటి మహానగరాల్లోనే ఉన్నారు, ఉంటారు. ఈ బాపతు మనుషులు పరిశ్రమలు స్థాపించో, వ్యాపారాలు సాగించో రెండుచేతులా సంపాదించి పోస్తుంటారు. వాటిలో నాలుగురాళ్ళు లాభం వస్తే ఆ లాభాలతో మళ్ళీ మరో ఇండస్ట్రీయో, బిజినెస్సో ప్రారంభిస్తారు. అలా అలా అల్లుకుపోయి బిర్లా టాటాల లెవెల్లోకి ఎదిగిపోతారు.

అయితే పెట్టుబడి లేకుండా పెద్దపెట్టున డబ్బు సంపాదించే మార్గాలు కూడా కొన్ని ఉన్నాయి. 'సినీ నటజీవితం' ఈ కోవలోకే వస్తుంది. ఎటొచ్చీ 'టాలెంటు'ండాలి. ఈ టాలెంటు కూడా అనేకరకాలు. ఆడవారికో రకం. మగవారికో రకం. ఎవరికివారు ఆయా రకాల 'టాలెంటు'ను ప్రదర్శించి హీరోకానీ హీరోయిన్ కానీ అయిపోతే ఇక డబ్బే డబ్బు.

దూరం నుంచి చూస్తే కొండలన్నీ నున్నగా కనిపిస్తాయి. అట్లాగే బయటనుంచి చూసేవారికి సినీనటుల జీవితం స్వర్గసీమలా కనిపిస్తుంది. రంగుల హరివిల్లనిపిస్తుంది.

కానీ అందరి జీవితాలూ అక్కడ వడ్డించిన విస్తళ్ళు కావు. అదృష్టదేవత కొందర్నే వరిస్తుంది. వాళ్ళు బస్సు కండక్టర్లే కావచ్చు. టైలర్లే కావచ్చు. సినిమా హీరోలై లక్షలు సంపాదించగలుగుతారు. ఒకప్పుడెప్పుడో కొంతమంది ఆ బాపతు హీరోలు లక్షలు సంపాదించినా లక్ష్యం లేకుండా ఖర్చుపెట్టి తమ చివరి రోజుల్ని లక్షణంగా గడపలేకపోయారు. వదిలెయ్యండి... కానీ వాళ్ళ చరిత్రలు చదివిన ఈనాటి హీరోలు 'ముందు జాగ్రత్త చర్యలు' తీసుకుని మందుక్కూడా 'కానీ' ఖర్చుపెట్టకుండా - అన్నింటికీ 'ప్రొడ్యూసర్'కే వేస్తారు. వాళ్ళ భోజనానికి వాళ్ళు ఖర్చు పెట్టరు. వాళ్ళ బట్టలకి వాళ్ళు ఖర్చు చేయరు. వాళ్ళ దారిఖర్చులకు వాళ్ళు జేబులో చెయ్యి పెట్టరు. అట్లా పొదుపు చర్యలు పాటించి సంపాదించుకుంటున్న డబ్బంతా రకరకాలుగా 'మంచి' పనులకోసం ఇన్వెస్ట్ చేస్తూంటారు. వాళ్ళ సంగతి మనకొద్దు. హీరోయిన్ల సంగతి చూద్దాం. అసలు హీరోయిన్ కావాలంటే అదృష్టం ఉండాలి. టాలెంటు ఉండాలి. ఆ పైన ఇంకా 'చాలా' ఉండాలి. హీరోయిన్ ముద్ర వేయించుకుంటే 'పదేళ్ళ బిజీ' గ్యారంటీ.

ఒక నటి 'మహానటి'గా ఎదగాలంటే - ఎంతో తాపత్రయపడాలి. కొందరైతే ఈ తాపత్రయంలో భాగంగా 'దేని'కైనా రెడీ అయిపోతారు. మనసుని చంపుకుంటారు. శరీరాన్ని అంకితం చేస్తారు. వెండి తెరమీద వెలగాలనే క్రేజు, కీర్తీ, డబ్బు కాంక్షా వారిచేత ఎలాంటి పనైనా చేయిస్తుంది. ఒక్కసారి మెట్లన్నీ ఎక్కేసి పై అంతస్తు చేరిపోతే గొడవ ఉండదు. అపుడు ఎలాంటివాళ్ళనైనా - తామే 'డిక్టేట్' చేయగలిగే పరిస్థితిని అందుకోవచ్చు.

*కానీ అందరికీ ఈ అవకాశం దొరకదు కాక దొరకదు. ఇదొక మత్తు. ఇదొక కలల ప్రపంచం. ఈ కలల ప్రపంచంలో కాలుపెట్టి - జారిపోయి - కరిగిపోయి - తమ జీవితాన్ని నాశనం చేసుకునే సోదరీమణులు ఎందరో ఉన్నారు.*

*అలాంటి వారి జీవిత గాథల్ని కొన్ని ఆ నోటా ఈ నోటా విన్నవే అయినా - వాటిని పరిశోధించి ఆయా తారల్ని స్వయంగా కలుసుకుని - వారి అనుభవాల్ని ముఖతః తెలుసుకుని, వాటిని యధాతథంగా మీ ముందుంచుతున్నాను.*

*అయితే అలాంటి వారి బ్రతుకుల్ని బట్టబయలు చేసి - వారిని అవమానాలకు గురిచేయాలని నా ఉద్దేశ్యం కాదు. వెండితెర మీదకు ఎక్కి వెలలేని సంపాదననీ, వేనోళ్ళ పొగడ్తల్నీ పొందాలని ఆశపడే అమ్మాయిలకు - ఆ వెండితెర వెలుగు జిలుగుల వెనుక ఎంతటి గాఢాంధకారం వ్యాపించి ఉంటుందో తెలియ చెప్పాలనే ఈ చిన్న ప్రయత్నం. అందుకే ఈ యధాతథ గాథల్లో అసలు పేర్లు మాత్రం ఇవ్వకుండా - అలాంటి వారి బాధామయ జీవితాలకు సానుభూతిగా ఈ కథలు మీకందించటం జరిగింది.*

*ఇదిలా రూపుదిద్దుకోడానికి కారకులు 'సితార' పత్రిక అసోసియేట్ సంపాదకులు శ్రీ శ్రీకంఠమూర్తిగారు. తమ పత్రిక కోసం ఈ పరిశోధనాత్మక రచనలు చేయమని, కోరటంతోబాటు అందుకు తగిన సహాయ సహకారాన్ని కూడా అందించారు. అందుకు వారికీ, వారి సిబ్బందికీ కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.*

*'సితార'లో ప్రచురించబడుతున్న సమయంలోనే ఈ 'కథలు' చదివి వీటిని 'పుస్తకరూపం'లో తీసుకురమ్మంటూ - భుజం తట్టి ప్రోత్సహించిన ప్రముఖ పాత్రికేయులు, నిర్మాత శ్రీ వాసిరాజు ప్రకాశంగారి సహృదయతను ఎప్పటికీ మర్చిపోలేను.*

*అలాగే ఈ రచనలన్నీ చదివి తన అమూల్యమైన అభిప్రాయాన్ని అందించిన మిత్రులు శ్రీ జంధ్యాలగారికి నా హృదయపూర్వకమైన కృతజ్ఞతలు అందచేస్తున్నాను.*

*ఈ రచనలు సితారలో 20 వారాలపాటు ధారావాహికంగా ప్రచురణయిన సందర్భంగా ఎందరో పాఠకులు అభిమాన పురస్సరంగా - శీర్షికను మెచ్చుకుంటూ, ఉత్తరాలు రాశారు. వారికి కూడా ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలుపుకోవటం నా కర్తవ్యంగా భావిస్తున్నాను.*

**జీడిగుంట రామచంద్రమూర్తి.**

*(నవంబర్ 1993)*

## "నాకు వేషం ఇస్తే - మీరు కోరుకున్నది ఇస్తాను"

**"కనిపించుటలేదు..**

ఈ ఫోటోలో వున్న సీతామహాలక్ష్మి అనే అమ్మాయి ఈనెల 6వతేదీ నుంచీ కనిపించటం లేదు. వయస్సు 18 సంవత్సరాలు. తెల్లగా, నాజూగ్గా వుంటుంది."

ఇలా టీవీలోగానీ, పేపర్లోగానీ ప్రకటన వచ్చిందంటే, సదరు సీతామహాలక్ష్మి ఎందుకు కనిపించకుండా పోయిందో తెలివైన ప్రేక్షకులు, పాఠకులు అతి సులువుగా అంచనా వేసుకోగలుగుతారు.

తెల్లగా, నాజూగ్గా అందంగా వుండే 'టీనేజ్ గర్ల్' ఇంట్లోంచి వెళ్ళిపోయిందంటే 'డెఫినెట్'గా అది ప్రేమ కేసయ్యుంటుంది. అంటే ఆ సీతమ్మవారు ఏ శ్రీరామచంద్రుడితోటో లేచిపోయుంటుందని తాత్పర్యం చెప్పుకోవాలి. ఆ వయసుకున్న పవరలాంటిది. మనవేం చెయ్యలేం.

'ప్రేమయాత్రలకు బృందావనాలు - నందనవనాలూ అక్కర్లేదని' అలనాడే ఓ కవిగారు చెప్పివున్నారు కనుక - అలా లేచిపోయిన ఆ సీతమ్మతల్లి మైసూరు, ఊటీ వెళ్ళకుండా రాములవారితో ఏ మామూలు సిటీయో చేరుకుని - అక్కడి 'హోటల్ రూమ్'లో ప్రేమ మత్తు దిగిపోయేదాకా గడుపుతుంది.

తర్వాత కథ ముగింపు నేను చెప్పను.

ఎందుకంటే ఈ బాపతు కథల ముగింపులన్నీ ఒక్కలా వుండవు కనక.

ఆ రాముడు నిజంగా రాముడిలాంటివాడే అయితే ఆ పిల్ల మెడలో మూడు ముళ్ళూ వేస్తాడు.

కానీ రావణుడైతే మాత్రం అవసరం తీర్చుకుని ఆఫ్టాలంటాడు. ఆ దెబ్బతో సీతామాలక్ష్మి భవిష్యత్తు అంధకారబంధురమవుతుంది. ఆత్మాభిమానం కలదైతే ఆత్మహత్య చేసుకుంటుంది. అది కాకపోతే ఆత్మను చంపుకుని బజార్లో పడుతుంది. వదిలేయండి.

ఇలా కనిపించకుండా పోయే అమ్మాయిల్లోనూ, అబ్బాయిల్లోనూ మరో తెగవారుకూడా వున్నారు. సినీమాల్లో చేరి హీరోయిన్లుగానూ, హీరోలుగానూ అయిపోవాలనుకుంటూ రంగురంగుల కలలు కని అవకాశం దొరికినప్పుడు అంతో ఇంతో మూటకట్టుకుని మదరాసు మెయిలెక్కేవారు కూడా ఈ కోవలోకే వస్తారు. ఇప్పుడిప్పుడు గోదావరి ఎక్స్‌ప్రెస్ ఎక్కి హైదరాబాద్ చేరుకుంటున్నార్లెండి.

అయితే ఇపుడు నేను చెప్పబోయే కథ ఆ విధంగా అప్పట్లో మదరాసు మెయిలు ఎక్కిన ఓ ఆడపడచుకథ.

ఈకథ - కట్టుకథ కాదు. వెండితెర సాక్షిగా జరిగిన సంఘటన. ఓ ప్రముఖ దర్శకుడు నాకు చెప్పగా ఆ సంఘటనకి కథారూపం ఇచ్చి మీ ముందుంచుతున్నాను చిత్తగించండి.

**అమలాపురం దగ్గర అదో మారుమూల పల్లెటూరు.**

ఆ ఊరి జిల్లా పరిషత్ హైస్కూల్లో శేషాచలపతిరావుగారు అప్పట్లో తెలుగుపండితుడుగా పనిచేస్తూండేవారు. ఆయనకు ఇద్దరు పిల్లలు. ఒక అబ్బాయి, ఒక అమ్మాయి. అబ్బాయి స్కూలు ఫైనలు పాసవగానే మిలటరీలో చేరిపోయాడు. అమ్మాయి ఆ ఊరి హైస్కూల్లో స్కూలు ఫైనలు పాసయ్యాక అమలాపురం కాలేజీలో ఇంటర్మీడియట్‌లో చేరింది. రోజూ తోటి స్నేహితురాండ్రతో బస్సెక్కి అమలాపురం వెళ్ళి వస్తూండేది. ఆ అమ్మాయి పేరు అనురాధ. (ఇప్పటి 'డేన్సర్' కాదని మనవి). కాలేజీలో చదువుతున్న ఆడపిల్లలందరిలోకి అనురాధ బహుతెలివైనదీ, చురుకైనదీ, ఆపై అందమైనదీ కూడా. అప్పుడప్పుడు మధ్యాహ్నం పూట క్లాసులు లేకపోతే స్నేహితురాండ్రతో మేట్నీ సినిమాలు చూసేది అనురాధ. అద్దెపుస్తకాల షాపులోంచి సినీమా పత్రికలు తెచ్చుకుని చదువుతూ వుండేది. అలా చదివి, చదివి 'సినీతారల జీవితం స్వర్గధామంగా ఉంటుంద'ని ఆమె ఊహించుకోసాగింది.

ఓసారి అమలాపురంలో ఓ సినీమా శతదినోత్సవ వేడుకలు జరుపుకున్న సందర్భంగా, అందులో నటించిన నటీనటులూ, దర్శకుడూ అక్కడకు వచ్చారు.

ఆరాత్రి ఫంక్షను.

అయితే ఆ ఉదయం అమలాపురం చేరుకోగానే, దర్శకుడు కార్లో శేషాచలపతిరావు ఇంటికి వెళ్ళాడు. ఆ దర్శకుడిపేరు రావు. చదువుకునే రోజుల్లో రావు ఓసారి జీతం కట్టలేకపోతే మేష్టారు ఆదుకున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే ఆయనకు రావు - ప్రియ శిష్యుడు.

అందుకే ఆరోజున ఫంక్షన్‌కి వచ్చిన రావు 'మేష్టార్ని' ఓసారి చూద్దామని వెళ్ళాడు. మధ్యాహ్నం మూడుగంటలదాకా వారింట్లో గడిపాడు.

రావు సినీమా పరిశ్రమలో అంత గొప్ప పేరు తెచ్చుకుని బాగా సంపాదిస్తున్నందుకు మేష్టారు చాలా ఆనందించారు. ఇంట్లో వారందరికీ అతన్ని గర్వంగా పరిచయం చేశారు.

"ఇవాళ ఫంక్షన్‌కి మీరు కూడా రావాలి మేష్టారూ!" అని ఆహ్వానించాడు రావు.

సినీమాల పట్ల అంతగా ఆసక్తిలేని మేష్టారు - "నన్నొదిలేయవయ్యా! అలాంటివి నాకు అంతగా పట్టవు. నువ్వు నన్ను చూడటానికి వచ్చావ్.. అంతేచాలు" అన్నారు.

"పోనీ మీ వాళ్ళను పంపించండి" అన్నాడు రావు. అనురాధ ముచ్చటపడటం చూసి ఆమెనీ, భార్యనీ అతని వెంట పంపించారు మేష్టారు.

అమలాపురం చేరేలోగా దారిలో రావుని సినీతారలగురించీ వాళ్ళ జీవితాల గురించీ పుంఖానుపుంఖంగా ప్రశ్నలడిగింది అనురాధ.

ఫంక్షను పూర్తయ్యాక మళ్ళీ తన కార్లో వాళ్ళను ఇంటికి పంపించాడు రావు.

ఈ సంఘటన తర్వాత రావు మరో రెండు మూడు చిత్రాలకు దర్శకత్వం వహించటం, అవికూడా విజయవంతం కావటం జరిగింది.

ఓరోజు పొద్దున్న రావు ఇంటిముందు టాక్సీ దిగింది అనురాధ.

బెడ్డింగు చేత్తో పట్టుకుని ఇంట్లోకి అడుగుపెట్టిన ఆ పిల్లను చూసి రావు ఆశ్చర్యపోయాడు.

"నేను చలపతిరావు మేష్టారి అమ్మాయిని సార్" అంది బెడ్డింగ్ గోడపక్కన పెట్టి.

"అవును. గుర్తుపట్టాను. ఏమిటి విశేషం? అందరూ కులాసాగా వున్నారా?" అంటూ ఆదరపూర్వకంగా ప్రశ్నలవర్షం కురిపించాడు రావు. అన్నింటికీ తీరుబడిగా సమాధానాలు చెప్పినతర్వాత -

"నేను సినీమాల్లో యాక్ట్ చేయాలని వచ్చాను సార్. మీరెలాగైనా నాకు సహాయం చేయాలి" అంది అనురాధ,

రావు తెల్లబోయాడు.

"మీ నాన్నగారికి చెప్పేవచ్చావా?" అని అడిగాడు. ఆమె తప్పు చేసినదానిలా తలవంచుకుంది.

విషయం సులువుగానే బోధపడింది రావుకి. సంప్రదాయమైన కుటుంబంలో పెరిగి కాలేజీలో చదువుకుంటున్న పిల్లను (ఆ రోజుల్లో) ఏ తండ్రీ సినీమాల్లో చేర్చాలని అనుకోడు. అందునా శేషాచలపతిరావుగారు అస్సలు అనుకోరని రావుకి తెలుసు.

"ఊఁ అయితే మీనాన్నగారికి చెప్పకుండా ఇంట్లోనుంచి పారిపోయి వచ్చేశావన్నమాట!" అన్నాడు.

"ప్లీజ్ సార్! మా నాన్నగారికి నేనిలా వచ్చినట్టు తెలియచేయవద్దు సార్. మీరంటే నాకెంతో అభిమానం కనుక చొరవచేసి వచ్చాను. మా నాన్నగారంటే మీకెంతో గౌరవం కనుక నాకు తప్పక సహాయం చేస్తారన్న ఆశతో వచ్చాను" గబగబా చెప్పేసింది అనురాధ, ఎందుచేతనో ఆమెను ప్రోత్సహించాలని రావుకి అనిపించలేదు. ఆ రాత్రి అమలాపురం ఫోన్ చేసి ఓ సినిమా థియేటర్ యజమాని ద్వారా శేషాచలపతి రావుకి కబురుపంపించాడు. అనురాధ తనదగ్గర క్షేమంగా వుందనీ వీలుచూసుకుని వచ్చి తీసుకెళ్ళమనీ చెప్పాడు.

మూడోరోజుకల్లా మేష్టారి దగ్గర్నించి టెలిగ్రాం వచ్చింది. "నేను త్వరలో వస్తాను. అనురాధ జాగ్రత్త." అని ఆ టెలిగ్రాం సారాంశం.

ఈలోగా ఒకరోజు సాయంత్రం రావు భార్యా పిల్లలు షాపింగ్‌కి వెళ్ళారు. ఏదో స్క్రిప్టు చూసుకుంటూ రావు ఒక్కడే తనగదిలో కూర్చుని వున్నాడు.

ఆ సమయంలో అనురాధ గదిలోకి వచ్చింది. రావు తన తండ్రికి కబురు చేసిన విషయం, తనను తీసుకు వెళ్ళేందుకు తండ్రి వస్తున్న విషయం ఆమెకు తెలియదు.

నెమ్మదిగా రావుని సమీపించింది అనురాధ.

"నా సంగతేం చేశారు సార్?" అడిగింది ఎదురుగా వున్న కుర్చీలో కూర్చుంటూ.

"సినీమాలో వేషమేకదా! చూద్దాం. ఇప్పటికిప్పుడు కావాలంటే ఎలా? టైం పడుతుంది అన్నాడు రావు.

"నాకు మీరు వేషం ఇప్పిస్తే మీరు ఏం కోరుకుంటే అది ఇస్తాను" అని చెప్పింది.

వింతగా ఆమెవైపు చూశాడు రావు.

"మీ మిసెస్ ఇంట్లో లేదుగా. మీరు రమ్మంటే 'బెడ్‌రూం'లోకి వస్తాను" ఏమాత్రం తొణక్కుండా అంటూన్న ఆ పిల్లవైపు అలాగే చూస్తూండిపోయాడు. అతను బదులు చెప్పకపోవటంతో, ఆ మౌనాన్ని అంగీకారంగా తీసుకున్న అనురాధ –

"త్వరగా రండి సార్ మళ్ళీ మీ మిసెస్ వచ్చేస్తుంది." అంటూ అతని చేయి పట్టుకుంది. ఆ చేయి విడిపించుకుని, దాంతోటే ఆమె చెంప చెళ్ళుమనిపించాడు రావు.

"నువ్ మేష్టారి కూతురువైపోయావ్ కనక ఇంతటితో ఊరుకున్నాను. లేకపోతే మెడపట్టి బయటకు గెంటేవాణ్ణి. సినీమాల్లో ఉన్న వాళ్ళకు నీతినియమాలుండవనుకుంటున్నావా? పిచ్చి పిచ్చి ఆలోచనలు కట్టి పెట్టి శ్రద్ధగా చదువుకో. మీనాన్నగారు చూసిన సంబంధానికి ఒప్పుకుని పెళ్ళిచేసుకో" అన్నాడు ఆవేశంగా.

అలాంటి సమాధానం ఆశించని అనురాధ ఏం చెప్పాలో, ఏం చేయాలో తెలియక కళ్ళనీళ్ళతో అలాగే చూస్తూండిపోయింది.

ఆ మర్నాడే శేషాచలపతిరావు వచ్చి కూతుర్ని ముఖం వాచేలా చివాట్లు పెట్టి సాయంత్రం బండిలో తీసుకు వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత ఓ ఏడాది గడిచిపోయింది.

ఓరోజు ఏదో పనిమీద రావు ఒక ప్రొడ్యూసర్ దగ్గరకు వెళ్ళాడు.

ఆ సమయంలో అక్కడకు ఓ అందమైన అమ్మాయి వచ్చింది.

"ఈ పిల్లెవరో తెలుసా? అనురాధనీ మీ సైడే అమలాపురం దగ్గర అదేదో ఊరట. సినీమాల్లో చేరాలని వచ్చింది" అంటూ ఆమెను రావుకి పరిచయం చేశాడు.

రావు ఆమెవైపు తీవ్రంగా చూశాడు.

ఆమె తలవంచుకుంది.

***(వచ్చేనెల మరో కథనం)***

*(పాతికేళ్ళ క్రిందట సితారలో ధారావాహికగా వచ్చిన ఈ కథనాలు*

*రచయిత ప్రత్యేక అనుమతితో పునర్ముద్రణ)*

Post your comments